కేచురాళ్ల కబేరి

– యశ్వంత్

చిన్నకథ

బస్సులో కిటికీ పక్కన కూర్చుని మారేడుమిల్లి,చింతూరుల మధ్య ఘాట్ రోడ్లో ప్రయాణించడమంటే, నాకు చిన్నప్పుడు టూరింగ్ టాకీసుల్లో చూసిన జానపద సినిమాలంత ఇష్టం. అంతూదరీలేని కొండల్నీ, దారితెన్నూ లేని అడవుల్నీ, అడుగంటూ కానరాని లోయల్నీ చూస్తుంటే– పాట్టి నిక్కర్లను కూడా గట్టున పెట్టి మా ఊరి వొయ్యేటిలో చేపలు పట్టినప్పుడు చిక్కినట్టే చిక్కి చేజారిన, బొమ్మిడాయల విశ్వ రహస్యమేదో నాకు అర్థమైనట్టే అయి అంతలోనే అయోమయంలోకి నెట్టేసి ఆట పట్టిస్తున్నట్టనిపిస్తుంది. పచ్చని ప్రకృతి మధ్య వెలసిన గిరిజన గూడేలలోని పూరిళ్ళ ముంగిట నిలిచి స్నేహపూర్వక దరహాసంతో, అమాయకత్వంతో బస్సుల వంక చూసే గిరిజనులనూ,లేగదూడల్లా గెంతులు వేసే వారి పిల్లలను చూస్తే –ముఖపరిచయంతో నిమిత్తంలేని ఆత్మీయుల్లా అనిపిస్తారు. వారి ముఖాలను చూస్తే'ముఖమే మనసుకు నిలువుటద్దం'అన్న మాట సార్థకమైనట్టుంది.



అసలు విశ్వపు ఉనికే మహా విస్మయకారకం కాగా– ఆపైన అది చీమ నుంచి తిమింగలం వరకు, ఇసుక రేణువు నుంచి మహా నక్షత్రం వరకు అసంఖ్యాక అవతారాలెత్తడం ఇంకెంత సంభ్రమాశ్చర్య హేతువు! ఆ ఘాట్ రోడ్లో ప్రయాణమే విశ్వ రహస్యం తెలుసుకోవడానికి సాగిస్తున్న పరిశోధనలా, బస్సు కిటికీయే భారీ టెలిస్కోప్‌లా అనిపిస్తుంది.

రెండేళ్ళ తరువాత ఈ దారిలో ప్రయాణించబోతున్నాను. ఈ ప్రయాణం కోసమే సెలవు పెట్టి హైదరాబాద్ నుంచి వచ్చాను. దశ దిశలా విస్తరిస్తున్న (అవును, మరి నాలుగు దిక్కులకూ, మరో నాలుగు మూలలకే కాదు, అంతస్తులతో నింగి వైపుకు, సెల్లార్లతో నేలలోకి జరుగుతున్న నగరం వాపుకు దశదిశలే) ఆ మహా నగరంలో బతుకు తెరువు కోసం ఉంటున్నానే కానీ, చిన్నతనంలో తిరణాలకెళ్ళి తప్పిపోయినప్పుడున్నంత బెంగగా ఉంటుంది. నాదికాని ముఖాన్నీ, నావి కాని నవ్వులనూ ఫెవిక్విక్‌తో అతికించుకుని బతుకీడుస్తున్నట్టే ఉంటుంది. ఇదే నగరంలో నాతో పాటు అరకోటి మంది పైనుంటేనేం– కారడవిలో గుంపుకు దూరమైన ఆదిమ మానవుడిలా ఒంటరితనం వెన్నాడుతుంటుంది. అడవులు, కొండల దాపుకు వెళితే గెడ్డం నెరిసిన వేళ కూడా పసిబిడ్డనై అమ్మ ఒడిలో చేరినట్టుంది నాకు. తన కోసం తెచ్చుకున్న తాయిలాన్ని నేనిష్టపడ్డానని సాంతం నాకే ఇచ్చేసిన బాల్యమిత్రుడుని తిరిగి కలుసుకున్నట్టుంది. నానావిధ కాలుష్యాల కీలల్లో బుగ్గయిన ఫీనిక్స్ పక్షిలా పునర్జీవించి పురివిప్పి ఆడుతున్నట్టుంది.

మా ఆవిడను కూడా రమ్మంటే రానంది.''యానిమల్ ప్లానెట్ ఛానల్ పెడితే వాటిని మించిన కొండలు, లోయలు, అడవులు బోలెడు కనిపిస్తాయి. పనిగట్టుకుని వెళ్ళటం నాకంతా వెర్రి లేదు. మీరు వెళ్ళి రండి'' అంది.

భద్రాచలం ఫస్ట్ బస్ ఎక్కితే, ఉదయపు వెలుగులో మేలి మంచు తెరను చీల్చుకుని బయట పడే వేళ నుంచీ ప్రకృతిని చూడొచ్చన్నది నా ఉబలాటం. అందుకే రాజమండ్రి మీదుగా రాత్రికే మారేడుమిల్లి వచ్చి లాడ్జీలో ఉన్నాను.

★★★

ఫస్ట్ బస్ బయల్దేరడానికి చాలా ముందే రోడ్డు మీదికి చేరుకున్నాను. ముందే వెళ్తే కిటికీ పక్క సీటు ఖాయం చేసుకోవచ్చని నా ఆత్రుత. తల్లి కప్పిన నల్ల దుప్పటిని ఓరగా తొలగిస్తున్న పసిబిడ్డలా, చీకటిని తొలగిస్తూ తూర్పు దిక్కు తెల్లబారుతుండగా బస్సు బయల్దేరింది. బస్సు సగమే నిండింది. తిరణాలకు బయలు దేరిన పిలగాడిలా నాకు ఎంతో హుషారుగా ఉంది. ప్రయాణం ముందుకా, వెనక్కా అన్న సందేహాన్ని కలిగించేలా కొండలెక్కుతూ, దిగుతూ, చుట్టలు చుట్టుకున్న కొండ చిలువలాంటి మలుపులు తిరుగుతూ– గడ్డి తుప్పలు, మహా వృక్షాలు,లతలూ ఒకదానికొకటి పెనవేసుకుని సమస్త వృక్ష జాతుల సహజీ'వన' వేదికగా తోచే చిక్కని అడవి మధ్యనుంచి, గిరిజనుల నవ్వులా స్వచ్ఛంగా పారే వాగుల పక్క నుంచి బస్సు పరుగు పెడుతుంటే' ఎబౌట్ టర్న్' అంటూ కాలాన్ని శాసించి గడిచిన యుగాల్లోకి మళ్ళించినట్టే ఉంటుంది. అడవి పక్షుల కూతలు ఆదిమ గానంలా, బస్సు ఇంజన్ చప్పుడు ఆ గానానికి హాయినిచ్చే ప్రశాంతత నన్ను అక్కున చేర్చుకున్నట్టుంటుంది.

★★★

దూరంగా ఉన్న ఎత్తైన కొండను తాకుతూ మెల్లగా సాగుతోంది

గుర్తింపుకోసం తపన

ఎప్పుడూ సినిమాల్లో కన్పించి ప్రేక్షకుల్ని కవ్వించే తారలు ఖాళీ టైంలో కూడా తమకు అలాంటి గుర్తింపునే కోరుకుంటారు. సుస్మితాసేన్ కూడా అలాగే అనుకుంటున్నట్టుంది. ఝాన్సీకి రాణి చిత్రంలో నటిస్తున్న ఈ భామ ఈమధ్య ఓ ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అయితే తన గురించి తాను చెప్పుకుంటే తప్ప ఆమెకి సరైన గుర్తింపు రాలేదట. తనకు నచ్చిన రెండు మూడు పెయింటింగ్స్‌ని అక్కడ్నించి తీసుకెళ్లి ఇంటిలో పెట్టుకుందిట. తనకు బాగా నచ్చినదాన్ని సెలెక్ట్ చేసుకుంటానని చెప్పడం, చివరికి ఆర్ట్ ఎగ్జిబిషన్ నిర్వాహకులు సానుకూలంగా స్పందించడం కొసమెరుపు.



ఓ మబ్బు. ''కొండ కొమ్మున ఉన్న చెట్లు ఆ మబ్బు స్పర్శకు ఎంత పులకరిస్తున్నాయో!''అనుకుంటుంటే ముల్లులా కర్ణభేరిని గుచ్చింది బిగ్గరగా 'హలో!' అన్నమాట. నా వెనుక సీట్లో ఉన్నతను సెల్‌ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. అతడు మాట్లాడే తీరు చూస్తే- సెల్‌ఫోన్ అవసరం లేకుండా అవతలి వ్యక్తికి నేరుగా వినిపించేలా వుంది. ''ఛఛ! ఇది బస్సు, తానొక్కడే కాదు చాలామంది ఉన్నారన్న జ్ఞానం కాస్త కూడా లేదు, ఏం మనుషులో!'' నాలో నేను తిట్టుకున్నాను. ఇది వరకు పల్లెటూరి అమ్మలక్కల వంటి వారు బస్సుల్లో ప్రయాణించేటప్పుడు బడబడ మాట్లాడుతూ వాళ్ళ ఇరుగింటి, పొరుగింటి కబుర్లు చెప్పుకుంటుంటే పట్టరాని కోపం వచ్చేది. కొన్ని సందర్భాల్లో అలాంటి వారిని నిరసిస్తూ ''కొంచెం నెమ్మదిగా మాట్లాడుకో రాదటమ్మా?'' అంటూ మందలించాను కూడా. ఇప్పుడు ఎక్కడబడితే అక్కడ, ఎప్పుడంటే అప్పుడు అమ్మలక్కలకు పదిరెట్ల శృతిలో సెల్‌ఫోన్లో మాట్లాడే వారు కోకొల్లలుగా తారసపడుతున్నారు. దూరానున్న వారితో సంభాషణను ఇంత సులభతరం చేసిన పరికరం కనీస సంస్కారాన్ని ఎంత దూరం చేస్తోందో కదా! అని మథనపడడం మినహా చేయగలిగిందేముంది? ఎందరినని నిరసించగలను?

వెనుక సీటు వ్యక్తి మాట్లాడటం ముగించక ముందే, క్షణాల్లోనే ఒకరి నుంచి ఒకరికి వైరల్ వ్యాధి సోకినట్టు- మరికొందరు జేబుల్లోంచీ, హ్యాండ్‌బ్యాగుల్లోంచి సెల్‌ఫోన్లు తీసి ''హలో'' అంటూ మాట్లాడటం మొదలెట్టారు. బస్సులో ఒకేసారి అంత మంది గొంతులు చించుకుంటూ మాట్లాడుతుంటే ఆ శబ్ద కాలుష్యానికి నా ప్రశాంతత తునాతునకలైంది. చేతిలోని తాయిలాన్ని కాకి తన్నుకుపోయిన చిన్న పిల్లాడిలా ఉక్రోశం వచ్చింది. నాకెంత కఠోరంగా అనిపిస్తున్నా ఫోన్ సంభాషణలు చెవుల్లో పడుతూనే వున్నాయి. వాటిని బట్టి చూస్తే- వారిలో ఏ ఒక్కరికీ బస్సులో వాతావరణాన్ని చెరపడుతూ అప్పటికప్పుడు మాట్లాడాల్సిన అవసరం ఎంతమాత్రం లేదని తెలుస్తూనే ఉంది. పొగ తాగే వారికీ, మద్యం తాగే వారికి వేళకి అవి పడక పోతే కలిగే ఆదుర్దా లాంటిదే, సెల్‌ఫోన్ ఉన్న వారికీ ఉంటుందనుకుంటా. ఇంత వ్యవధికోసారైనా మాట్లాకపోతే అస్థిమితంగా ఉంటుందనుకుంటా!

సెల్‌ఫోన్లలో మాట్లాడుతున్న వారి ముఖ కవళికలను చూస్తే-అవతలి వారితో మాట్లాడుతున్నందుకు, వారి కంఠస్వరాలను వింటున్నందుకు, గాలి తాకి పూలు ఊగుతున్నంత సహజాతి సహజంగా ఆనందిస్తున్న సూచనలు కనిపించనే లేదు. టీవీ యాంకర్లలా పరమ కృతకమైన హావభావాలను ప్రదర్శిస్తూ కబుర్లు కురిపిస్తున్నారు. ఒక పెద్దాయన అవతలి వారిని తాను చెప్పినట్టు చేయమని గద్దిస్తున్నాడు. మరో మార్కెటింగ్ ఉద్యోగి ఎక్కడికెంత సరకు పంపాలో ఎవరికో చెపుతున్నాడు. ఇంకొకతడు తన అన్నతో జరుగుతున్న ఆస్తి వివాదం గురించి వివరిస్తున్నాడు. మరొకడు రియల్ ఎస్టేట్ మాంద్యం గురించి ఆవేదన పడుతున్నాడు. ఓ యువకుడు అర్థం కాని సంకేత భాష లాంటిదేదో (బహుశా- అవతల ఉన్నది ప్రియురాలు కావచ్చు) మాట్లాడుతున్నాడు. ఒక మహిళ రాజమండ్రిలో తాను చేసిన షాపింగ్ గురించి లొట్టలు వేసుకుంటే వర్ణిస్తోంది. డబ్బాల్లో పోసి గిలకరిస్తున్న పొడి గులకరాళ్ళలాంటి మాటలు బస్సులో మార్మోగుతుండగా నిస్సహాయంగా నిట్టూర్చాను. పెదాలు కక్కుతున్న ఈ మాటలన్నీ, క్వారీ క్రషర్లలోంచి రాలుతున్న రాతి ముక్కల వంటివే. ప్రతి ముక్కకూ వేర్వేరు ప్యాకేజీల కింద వెల ఉంటుంది. ఇదంతా వ్యాపారం, తపో భూములవంటి ప్రాంతాల్లోకి చొచ్చుకుపోయిన శబ్ద వ్యాపారం. ఈ ఘోషంతా చేతనత్వం కాదు- మానవ జ్ఞానం ప్రసాదించిన అద్భుత సాధనాన్ని ఎక్కడ, ఎలా వినియోగించాలో మరిచేలా చేసిన ఇంగిత జ్ఞాన రాహిత్యం. నీరింకిన వేసవి వాగులోని ఇసుకలా హృదయ స్పర్శ లేనిది శబ్దరాశి. ఇది ఎవరి లాభరాశుల కోసమో, మనుషుల్లో ఎగదోయబడ్డ వ్యసనం తప్ప, వర్షరుతువులో సెలయేటి గలగగల లాంటిదో, వసంత రుతువులో కోయిల కుహూకుహూ లాంటిదో కానేకాదు.

★★★

కటువైన కీచురాళ్ళ కచేరీతో కోపగించిన కోయిల అకాలంగా బిగ్గరగా కూసినట్టు ఉన్నట్టుండి- సెల్‌ఫోన్ సంభాషణల రణగొణలను బిత్తరపోయేలా చేస్తూ, తారాస్థాయిలో గొంతు చించుకుంటున్న పసిబిడ్డ ఏడుపు బస్సులో మార్మోగింది. ఆ ఏడుపు ఏ శృతిలో ఉందంటే, సెల్‌ఫోన్లలో మాట్లాడుతున్న వారంతా ఒక్కసారిగా మాటలాపి, అసహనంగా ముఖాలుపెట్టి ఆ ఏడుపు వస్తున్నదెక్కడి నుంచా అని చూడక తప్పలేదు. నాకు ముందు రెండో వరుసలో కిటికీ పక్కన కూర్చున్న తల్లి ముఖాన్నీ, భుజాల్నీ ఇష్టానుసారంగా రక్కుతూ, ఏదో కావాలని రణపేచీ పెడుతోన్న పాపాయిదే ఆ ఏడుపు. ఆ పాపాయికి రెండున్నరేళ్ళ వయసుంటుంది. ఎందుకంత పేచీ పెడుతోందా! అని గమనిస్తే తెలిసింది- ఘాటీ పక్కన ఓ పచ్చని చెట్టు మీద పూసిన తెల్లపువ్వుల లాంటి కొంగల గుంపును చూసిందా పాపాయి. ఎవరో దోసిలితో వెదజల్లినట్టు- బస్సు సవ్వడికి ఆ కొంగలన్నీ ఒక్కసారే రివ్వున ఎగిరిపోయాయి. తనకో కొంగ కావాలని ఆ పాపాయి పట్టుబడుతోంది. ఆ తల్లి ఏదోలా సముదాయించజూస్తోంది. కర్రల సంచిలోంచి ఏదో తినుబండారం తీసి ఇవ్వబోయింది. సీసా తీసి పాలు పట్టించబోయింది. ఊరెళ్ళాక ఏదో కొనిపెడతానని వాగ్దానం చేసింది. కానీ, పాపాయి ససేమిరా అంటోంది. ''కొంగ కావాలి'' అన్న ఏడుపే పల్లవిగా, అనుపల్లవిగా ,చరణాలుగా ఉచ్ఛశృతిలో ఆలపిస్తోంది. సెల్‌ఫోన్ల వాళ్ళ ముఖాలు చూస్తే నాకు సంబరమేసింది. వాళ్ళు బిగ్గరగా మాట్లాడుతుంటే ఏమీ అనలేక నిస్సహాయంగా ఉండిపోయానో, ఇప్పుడు వాళ్ళూ అలాగే ఉక్రోషంగా చూడడం మినహా ఏమీ చేయలేకపోతున్నారు.

కంఠనాళాలు చీరుకుపోతాయా అన్నంతగా పాపాయి ఏడుపు ఇంకా ఇంకా హెచ్చుతోంది. ''అయ్యో! అంతగా ఏడుస్తోందే!'' అనిపించినా నాకిప్పుడెంతో ప్రశాంతంగా ఉంది. సెల్‌ఫోన్ల శబ్దఘోషతో పోలిస్తే, పాపాయి ఏడుపు మానవ చైతన్యానికి కట్టిన మధురమైన బాణీలా వినిపించింది. ఆ ఏడుపులో లాభం కోసం వ్యాపారులెవరో మప్పిన కృతకత్వం లేదు. ఎదిగిన మనుషులు స్వరపేటికలకు తొడిగే ముసుగులు లేవు. ఆ ఏడుపు-రెక్కలున్న పక్షి ఎగరడంలా, నీరు పల్లానికి ప్రవహించడంలా, మొగ్గ విచ్చుకోవడంలా సహజాతిసహజంగా అనిపించింది. జిజ్ఞాస బీజపు సరికొత్త అంకురంలా తోచింది. ఆ పాపాయి మంకుతనం దేన్నైనా సాధించాలన్న మానవ సంకల్పానికి లేత ప్రాతినిధ్యంలా కనిపించింది. మెలికలు తిరిగే ఘాటీలో దూసుకుపోతున్న బస్సులోంచి ప్రయాణించే ఆ పాపాయి ఏడుపు తాలుకూ శబ్ద తరంగాలు, మేఘాలనంటిన కొండకొమ్ములను తాకుతాయి. అడుగు కానరాని అగాధాలలోకి ప్రవహిస్తాయి. దుర్గమారణ్యాలను చీల్చుకుపోతాయి. పరిసరాల్లోని ప్రతి అణువుతో ఆ తరంగాలకు అవ్యక్తమైన అనుబంధం ఏర్పడుతుంది. మకిలి అంటని స్వచ్ఛమైన పాపాయి స్వరపేటిక నుంచి పురుడు పోసుకున్న రోదనను వింటూ ఉంటే, నా ఘాట్ రోడ్ ప్రయాణపు ఆనందం రెట్టింపైంది.

★